# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-07-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నామని తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**2. తెలంగాణలో నాణ్యమైన విద్యుత్ సరఫరా, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.**

**3. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెలా నెలవారీ ఆర్థిక నివేదిక రూపొందించనుందని వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారధి.**

**4. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల విస్తరణ కోసం భూసేకరణకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పోలవరం పర్యాటక అభివృద్ధి ప్రణాళికపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, కేబుల్-స్టేడ్ బ్రిడ్జి రూపకల్పన, స్పిల్‌వే సుందరీకరణ, సాహసక్రీడా పర్యాటకం, వాటర్ స్పోర్ట్స్ వంటి అంశాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులతో పాటు పర్యాటక అభివృద్ధి పనులను కూడా చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

తెలంగాణలో నాణ్యమైన విద్యుత్ సరఫరా, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జూలకల్‌లో నాలుగు విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించిన ఆయన, ఎర్రవల్లిలో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా 12 విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖలో అంబులెన్స్ సేవలను ప్రారంభించడం ద్వారా అత్యవసర సేవలను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు.

--------------------------

ఢిల్లీలో జరుగుతున్న 'భారత్ టెక్స్-2026' అంతర్జాతీయ వస్త్ర ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ 'లేపాక్షి' స్టాల్‌ను కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ నిన్న ప్రారంభించారు. స్టాల్‌లో ప్రదర్శించిన శ్రీకాళహస్తి పెన్ కలంకారీ, మచిలీపట్నం బ్లాక్ ప్రింట్ కలంకారీ, నరసాపురం అల్లికలు, ఏలూరు తివాచీ వంటి సంప్రదాయ ఉత్పత్తులను పరిశీలించిన కేంద్ర మంత్రి, తెలుగు కళాకారుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి. హరిప్రసాద్ మాట్లాడుతూ, 'భారత్ టెక్స్--2026' ద్వారా రాష్ట్ర చేనేత, హస్తకళ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.

-------------------------

దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెలా నెలవారీ ఆర్థిక నివేదిక రూపొందించే విధానాన్ని ప్రారంభించిందని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అమరావతిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నివేదిక ద్వారా ప్రభుత్వ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలను ప్రతి నెల సమీక్షిస్తామని చెప్పారు. ప్రజాకేంద్రిత పరిపాలన, పారదర్శక వ్యవస్థలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ ద్వారా పాలన అందించే రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ దృశ్య మాధ్యమం విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సుమారు 75 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రి ద్వారా రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని తెలిపారు.చిత్తూరు, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో కూడా కొత్త ఈఎస్ఐ ఆసుపత్రులను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల రెండో దశ విస్తరణ కోసం భూసేకరణకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలో ఆయన నిన్న మాట్లాడుతూ... రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం పోర్టుల అభివృద్ధిలో భాగంగా మొత్తం 6 వేల 248 ఎకరాలకు పైగా భూసేకరణ కోసం సుమారు 1,638 కోట్ల నిధులకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులతో పోర్టుల సామర్థ్యం పెరుగుతుందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు బస్సు యజమానుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపిన చొరవకు విజయవాడలో నిర్వహించిన కృతజ్ఞత సభలో రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నిన్న పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవలు అందించేందుకు దశలవారీగా విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్రగడ పద్మనాభం నిన్న సాయంత్రం కన్నుమూశారు. ఆయన వయస్సు 73 సంవత్సరాలు. కాపు ఉద్యమ నేతగా ప్రసిద్ధి చెందిన ముద్రగడ పద్మనాభం1953 జనవరి 22న ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించారు. నాలుగు సార్లు శాసనసభ్యుడి, ఒకసారి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. పద్మనాభం మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు కె.చంద్రశేఖర్ రావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 43 లక్షల 30 వేల మంది విద్యార్థులకు ఈరోజు నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన 2 లక్షల 50 వేల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. చిన్న వయస్సులోనే కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించడం ద్వారా విద్యార్థుల చదువు, ఏకాగ్రత, మానసిక వికాసం మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో కోర్ అర్బన్ రీజియన్ – క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను త్వరలో ప్రకటిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న తక్కువ ఆదాయ వర్గం– ఎల్ఐజీ గృహాల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో హైదరాబాద్‌లో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలిదశలో ప్రతి నియోజకవర్గానికి 500 నుంచి వెయ్యి వరకు ఎల్ఐజీ గృహాలను కేటాయించనున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏడాది జూలై 15న ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారిని సమర్థులైన ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం.

======================